సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

దీపావళి సామగ్రి విక్రయాలకు దరఖాస్తులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లల పాలెం వుడాకాలనీలోని వాకర్స్ మైదానంలో దీపావళి సామగ్రి విక్రయించడానికి అనుమతుల కోసం సుమారు 38 మంది వ్యాపారులు మంగళవారం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 29న అనుమతులు వచ్చిన వెంటనే స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి దీపావళి సామగ్రి అమ్మకాల కోసం స్టాల్స్ పెట్టుకునేందుకు పలువురు వ్యాపారులు పోటీ పడుతున్నారు.

నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే గణబాబును కలిసిన నాయకులు

విశాఖ విద్య: నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ జిల్లా అధ్యక్షులు నరవ పైడిరాజు ఆధ్వర్యంలో మంగళవారం అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. గణబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న చేతి వృత్తి దారులంతా పీఎం విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లపల్లి అప్పలరాజు, కిజంగి శ్రీనివాసరావు, పైడా శ్రీనివాసరావు, కందికొండ శ్రీనివాసరావు, పైడాడ శేషు పాల్గొన్నారు.

బాల్యం పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరికాలనీ కొండ ప్రాంతంలోని బాల్యం పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే పి.గణబాబు పరిశీలించారు. పాఠశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. గోడ బీటలు వారి,రంగులు వెలసి ఉంది. స్థానిక టీడీపీ నాయకులు సమస్యను ఎమ్మెల్యేకు వివరించడంతో ఆ ప్రాంతానికి వచ్చి పాఠశాల పరిస్థితిని పరిశీలించారు.అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామ్మోహన్‌నాయుడు,హరి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నం సామాజిక ఆస్పత్రిలో రక్త నిల్వ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి,వారికి ఏ మేరకు వైద్య సేవలు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వైద్యులతో సమీక్షించారు. ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కల్పనకు ఎలాంటి పనులు చేపట్టాలనే దానిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జోనల్ కమిషనర్ హైమావతి, ఆస్పత్రి వైద్యులు , సిబ్బంది పాల్గొన్నారు.

డీపీటీవోకు అభినందనలు



జిల్లా ప్రజా రవాణా అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బి.అప్పలనాయుడును విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జై భీమ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా సెక్రటరీ యల్లపు రాంబాబు, పలువురు సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

జలం.. గరళం



నేలబావిలో ఆత్మహత్య చేసుకున్న మహిళ(ఫైల్)



గౌరీనగర్‌లో వ్యర్థాలతో నిండిన నేలబావి

- వ్యర్థాలతో నిండుతున్న బావి
- నీరు వాడుతున్నా శుభ్ర పరచని వైనం
- అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధి ఊర్వశికూడలి గౌరీనగర్‌లో నేలబావి డంపర్ బిన్‌గా మారిపోయింది. నిర్వహణ లేక నాచు పట్టి వ్యర్థాలతో నిండిపోయింది. గౌరీనగర్, సుభాష్‌నగర్, గోకుల్‌నగర్, దుర్గానగర్ ప్రాంతాల ప్రజలు గృహ అవసరాలకు, కరెంట్ లేని సమయాల్లో బావి నీటినే వినియోగిస్తున్నారు. అయినా మందుబాబులు వాడిపడేసిన సీసాలు, ఇతరత్రా వ్యర్థాలు బావిలో పడేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్వహణ లేక..

ఇటీవల కాలంలో బావిలో పడి పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి బావిని శుభ్ర పరచకపోవడంతో నీటిని వినియోగించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. గతంలో బావిలో ఎవరైనా చనిపోతే జీవీఎంసీ మంచినీటి విభాగ అధికారులు నీటిని మోటర్ సహాయంతో తోడించి బ్లీచింగ్‌తో శుభ్రపరిచే వారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడంలేదని వాపోతున్నారు. సచివాలయంలో, మంచినీటి విభాగ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు.

భయం.. భయం

ఇటీవల ఈబావిలో మహిళ ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి బావి పక్కకు వెళ్లేందుకు స్థానిక మహిళలు భయాందోళన చెందుతున్నారు. సంఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా మంచినీటి విభాగ సిబ్బంది బావిని శుభ్రపరచలేదు. దీంతో స్థానికులు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గృహ వినియోగానికి బావి నీరే..



జీవీఎంసీ పబ్లిక్ కుళాయి నీరు రాని సమయంలో గృహ అవసరాలకు బావి నీటినే ఎక్కువగా వినియోగిస్తున్నాం. బావిలో ఆకతాయిలు వ్యర్థాలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. నిర్వహణ లేక గోడలు నాచు పట్టి అపరిశుభ్రంగా మారింది. అధికారులు స్పందించి బావిలో చెత్త తొలగించి శుభ్రం చేయించాలి.

– కొల్లా భవాని, గృహిణి, గోకుల్‌నగర్,

పరిసరాలు దారుణం



జీవీఎంసీ ఆధీనంలో ఉన్న నేలబావి నీటిని ఎన్నో ఏళ్లగా వినియోగిస్తున్నాం. నేలబావి నీటినే గృహ అవసరాలకు వాడుతున్నాం. బావినీరు నాచు పట్టి దుర్వాసన వెదజల్లడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. స్థానిక ప్రజాప్రతినిధికి చెప్పినా పట్టించుకోవడంలేదు.

– కనక మహాలక్ష్మి, గౌరీనగర్, గృహిణి,

అధికారులు స్పందించాలి



నేలబావి సమస్యపై మంచినీటి సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. నేలబావి నీటిని నిత్యం తోడడంతో ఆరోగ్యంగా ఉంటుంది. యోగా చేసిన తృప్తి కలుగుతుంది. మా కుటుంబాలు నేలబావి నీటినే వినియోగిస్తున్నాం. ఉన్నతాధికారులు పర్యవేక్షించి నేలబావిని శుభ్రపరచాలి.

–వి.దశరథ, స్థానికుడు, సుభాష్‌నగర్,

నిరాశ్రయుడికి ఉపాధి



ఉపాధి చూపిన వారికి అభినందనలు తెలుపుతున్న నాని

విశాఖ విద్య: చిన్నప్పటి ఉంచి అనాథ ఆశ్రమంలో ఉంటూ చదువుకున్న ఓ వ్యక్తికి ఉపాధి చూపించి మానవత్వాన్ని చాటుకున్నారు జీవీఎంసీ బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత. వివరాలు.. గుమ్మడి నాని అనే వ్యక్తికి కుటుంబ సభ్యులు లేరు. అనాథ ఆశ్రమంలో చదువుకున్నాడు. ల్యాబ్ టెక్నీషియన్ పూర్తి చేసినా ఉద్యోగం లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కొన్ని రోజులు సింధియా ప్రాంతంలోని స్నేహితుడి ఇంట్లో ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో స్నేహితుడి ఇంటి నుంచి బయటకు వచ్చేసి ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న విషయాన్ని తెలుసుకున్నజీవీఎంసీ షెల్టర్ మేనేజర్ మమత అతని వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. అతనికి ఆశ్రయం కల్పించడమే కాకుండా నగరంలోని అభి హాస్పటల్ అధినేత వానపల్లి సోమేశ్‌తో మాట్లాడి ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉపాధి లభించేలా చొరవ తీసుకున్నారు. ఫుట్ పాత్ మీద ఉన్న తనకు ఆశ్రయం కల్పించి, ఉపాధి చూపించినందుకు మేనేజర్ మమత తో పాటు అభి హాస్పటల్ నిర్వాహకులకు నాని ధన్యవాదాలు తెలిపాడు.

ప్రభుత్వ న్యూ ఐటీఐలో జాబ్ మేళా రేపు

పెదగంట్యాడ: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ న్యూ ఐటీఐలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ న్యూ ఐటీఐ ప్రిన్సిపల్ కేఎస్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, పెయింటర్, మెషినిస్ట్ పూర్తి చేసిన వారితో పాటు ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌లో 100 మందికి అప్రెంటిషిప్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అలాగే నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టులో క్లర్క్, ఇన్‌చార్జి, ఐటీ–హార్డ్‌వేర్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని తెలిపారు. మోల్‌బియో డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 వరకూ ఖాళీలు ఉన్నాయని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 24న ఉదయం 9.30 గంటల నుంచి ప్రభుత్వ న్యూ ఐటీఐలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8121743777 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సభ్యత్వాన్ని అందజేస్తున్న రవీందర్ రెడ్డి

విశాఖ విద్య: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గలో ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర క్రియాశీల సభ్యత్వ ప్రముఖులు బుద్ద లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాయకులు పార్టీ క్రియాశీల సభ్యత్వం కోసం ప్రజలను ప్రోత్సహించాలన్నారు. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త దాడి పురుషోత్తం రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ బాధ్యులు బి. సంతోష్ కుమార్ సింగ్, సహ సభ్యత్వ ప్రముఖ్ లక్కరాజు రామకృష్ణ , పాలిమేర శ్రీనివాస్, ఎన్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సింధియా: గత నెలలో కురిసిన వర్షాలకు జీవీఎంసీ 62వ వార్డు పరిధి తెలుగుదేశంకాలనీ కొండవాలు ప్రాంతంలో రోడ్లు, గోడలు పూర్తిగా దెబ్బతినడంతో స్థానికుల వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన మాలినాయుడు స్థానిక ఎమ్మెల్యే గణబాబుతో మాట్లాడారు. వెంటనే దీనికి సంబంధించిన పనులు ప్రారంభించారు. దీంతో కొండవాలు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు, వార్డు ప్రచార కార్యదర్శి దుర్గారావు పరిశీలించారు.

ఆదర్శ ఐఏఎస్ అధికారి శంకరన్



మాట్లాడుతున్న ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు

సీతంపేట : భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ కోణంలో అమలు జరిపిన ఆదర్శ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ అని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు అన్నారు. విదసం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం శంకరన్ 90వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ చట్టాలు, సంక్షేమ పథకాల రూపశిల్పి శంకరన్ అని కొనియాడారు. విశ్రాంత పోస్టు మాస్టర్ జనరల్ ముత్యాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులకు రోల్ మోడల్ శంకరన్ అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఎన్నో జీవోలు జారీ చేసిన నిజాయతీ గల కార్యనిర్వాహకుడని ప్రశంసించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, రెసిడెన్షియల్ సొసైటీ జిల్లా సమన్వయ అధికారి రూపవతి, హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివసారావు మాట్లాడుతూ శంకరన్ నిరాడంబరత, అంకిత భావం అందరికీ ఆదర్శం కావాలన్నారు. విదసం కన్వీనర్ బూసి వెంకటరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఎంసీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, పౌరహక్కుల సంఘం నాయకులు టి.శ్రీరామమూర్తి, సుజాత, సుధాకర్, ఫ్రాన్సిస్, కస్తూరి తదితరులు శంకరన్‌కు నివాళులర్పించారు. అనంతరం శంకరన్ జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీల విజేతలకు భారత రాజ్యాంగం పుస్తకాలు, ప్రశంసాపత్రాలు బహూకరించారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండండి

ఎంవీపీకాలనీ: మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిషేదంపై ఎంవీపీకాలనీలోని సమత కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎండాడ దిశ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ యు.రూపావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం మహిళలు, చిన్నారులపై సమాజంలో తీవ్రమైన నేరాలు జరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియా వినియోగం విస్తరించడం, మాదక ద్రవ్యాల చలామణి పెరిగిపోవడం దీనికి కారణంగా నిలుస్తున్నాయన్నారు. ఈ రెండింటికి దూరంగా ఉండటం ద్వారా నేరాలకు అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియాలో అసభ్యపద జాలంతో మహిళలను దూషించడం, వారి ప్రమేయం లేకుండా వారి చిత్రాలను మార్ఫింగ్ చేయడం వంటి నేరాలకు కఠినమైన శిక్షలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు ఎదురైతే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

రూ.10 నాణేల చెల్లుబాటుపై అపోహలొద్దు



ఖాతాదారులకు నాణేలు అందజేస్తున్న బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్

సీతంపేట : స్థానిక సీతంపేట ఇండియన్ బ్యాంకు వద్ద రూ.10ల నాణేల చెల్లుబాటుపై ఖాతాదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ మాట్లాడుతూ పది రూపాయల నాణేలు చెల్లవని చాలా రోజులుగా పుకారు ఉందన్నారు. దానిపై ప్రజల్లో, వ్యాపారుల్లో ఉన్న అపోహలు నివృత్తి చేసేందుకే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్ట ప్రకారం రూపొందించి చెలామణీలోకి తీసుకొచ్చామన్నారు. ఎలాంటి లావాదేవీలకైనా ఈ నాణేలు వాడొచ్చని... అపోహలు, సందేహాలు వీడి పది రూపాయల నాణేలతో నిరభ్యంతరంగా లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు పది రూపాయాల నాణేలు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో హిందీ అభివృద్ధి



సదస్సు ప్రారంభిస్తున్న అజమతుల్లా ఖాన్, తదితరులు

మహారాణిపేట: హిందీ భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నేవల్ డాక్‌యార్డు జనరల్ మేనేజర్ (మానవ వనరులు) కమొడోర్ అజమతుల్లా ఖాన్ కోరారు. ఫిషింగ్ హార్బర్ బీచ్ రోడ్డులోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం హిందీ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. భారతీయ మత్స్య పరిశోధన సంస్థ విశాఖ కార్యాలయ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి మాట్లాడుతూ హిందీ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు వివరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ లలన్ కుమార్, వీరేంద్ర కాజీ, ప్రవీణ్ కుమార్, షానవాజ్, తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు



పిలకవానిపాలెం శివారు ప్రాంతంలోని గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థాలు



గెడ్డను ఆనుకుని అడ్డంగా ఉన్న గోడ



పిలకవానిపాలెం వీధి కాలువలో నిలిచిన వ్యర్థాలు

మల్కాపురం : అధికారుల నిర్లక్ష్యం కారణంగా 58వ వార్డు పిలకవానిపాలెంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. సకాలంలో పూడికలు తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పుక్కుపుటాలు అదిరిపోతున్నాయి. పిలకవానిపాలెం గ్రామానికి శివారు ప్రాంతంలో సుమారు 5 అడుగుల వెడల్పుతో గెడ్డ ఉంది. ఎగువ ప్రాంతాలైన శ్రీనివాస్‌నగర్, గుల్లలపాలెం, ఉప్పరకాలనీ, అజంతాకాలనీ తదితర ప్రాంతాల నుంచి మురుగుతో కూడిన వ్యర్థాలు ఈ గెడ్డ మీదుగా సముద్రంలో కలుస్తుంటాయి. అయితే పిలకవానిపాలెం శివారు ప్రాంతంలోని గెడ్డకు పైన ఏకశిల వారు తమ సంస్థ కోసం రక్షణ గోడను నిర్మించారు. నిలిచిపోతున్న వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉంది. శానిటరీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వ్యర్థాలు తొలగించడం లేదు. దీంతో గెడ్డను ఆనుకుని నివసిస్తున్నవారు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇప్పటికైనా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి



నియామకపత్రం అందుకుంటున్న ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: వినియోగదారుల హక్కుల పరిపాలక సంస్థ జాతీయ ముఖ్య అధికార ప్రతినిధిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆల్ఫా కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నగరంలో జరిగిన సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే నియామక పత్రాన్ని అందజేశారు.హెచ్‌ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్‌గా ఉన్న ఆల్ఫా కృష్ణ మానవ హక్కుల పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి కన్జూమర్ రైట్స్ కౌన్సిల్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తున్నట్లు డాక్టర్ వికాస్ పాండే వెల్లడించారు. జాతీయ అధికార ప్రతినిధిగా 2026 డిసెంబర్ వరకు కొనసాగనున్నట్లు డాక్టర్ పాండే వెల్లడించారు. తన సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో కీలక స్థానాన్ని అప్పగించినందుకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

నాటక బంధం పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న సిక్కిం పూర్వ డీజీపీ అత్తిలి సుధాకర్

సీతంపేట : నాటక రంగం, జర్నలిజం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేసేలా మరిన్ని పుస్తకాలు రావాలని సిక్కిం పూర్వ డీజీపీ అత్తిలి సుధాకర్ అన్నారు. విశాఖ చైతన్య సమితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సభలో రచయిత బి.వి.అప్పారావు రచించిన 'నాటక బంధం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటక రంగంపై పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. తను నాటక కుటుంబంలో పుట్టానని, తండ్రి అత్తిలి కృష్ణారావు వల్ల నాటక రంగంపై మంచి అవగాహన ఉందన్నారు. ఈ అనుభవం తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడిందన్నారు. తను కూడా 200కుపైగా వీధి నాటకాలు వేశానని, ఆ నాటకాలలో సమాజాన్ని చైతన్యపరిచే మంచి సందేశం ఉండేదని గుర్తు చేశారు. సభాధ్యక్షుడు, ప్రముఖ పాత్రికేయుడు పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ బీవీ అప్పారావు రచయిత కాకుండా మంచి నటుడని తెలిపారు. నాటక రంగాన్ని ఎంత మంది ఉన్నత స్థితికి తీసుకెళ్లారో ఈ పుస్తకం ద్వారా తెలుస్తుందన్నారు. పుస్తకంలో 500 మంది నటుల చరిత్ర ఉందని, నాటక రంగంపై పరిశోధన చేయాలనుకునే వారికి ఒక గైడ్‌లా ఉపయోగపడుతుందన్నారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఆనాటి పాత్రికేయులకు క్రమశిక్షణ ఉండేదని, నేడు పెట్టుబడిదారుల చేతుల్లోకి పాత్రికేయ వ్యవస్థ వెళ్లిపోయి దారి తప్పిందన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కళారంగ అభివృద్ధికి ఇటువంటి పుస్తకాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కొణతాల సూర్యనారాయణ, పి.రవి, మేడా మస్తాన్‌రెడ్డి, స్వామి, ఎం.ఎస్.ప్రకాష్, హరిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల ఖాతాల్లో డబ్బులేయకుంటే సమ్మె చేస్తాం

ధర్నాలో సీఐటీయూ నాయకులు



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కుమార్



ధర్నాలో పాల్గొన్న జీవీఎంసీ కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ కార్మికుల జీతాల నుంచి ఆదాయపు పన్ను పేరుతో చట్ట విరుద్ధంగా కట్ చేసిన డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల నుంచి కట్ చేసిన డబ్బులు ఎస్ఎల్ఎఫ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. కట్ చేసిన మూడు కోట్ల రూపాయలను కార్మికుల ఖాతాల్లో జమ చేయకుంటే సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నేటికీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటమి తప్పదని హెచ్చరించారు.

ధర్నా అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో సీఐటీయూ నాయకులు చర్చలు జరిపారు. ఎస్ఎల్ఎఫ్ గ్రూపు సభ్యులతో చర్చించి కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఎంవీ ప్రసాద్, జె.నాయుడు, గొలగాని అప్పారావు, బి.రత్నం, ఒమ్మి అప్పారావు, ఈశ్వరావు, గణేష్, ఈ.ఆదినారాయణ, వరలక్ష్మి, శేషు, సత్యవతి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com